RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana



## తాతా మధును బర్తరఫ్ చేయాలి



**పాల్వంచ, సెప్టెంబర్ 8 (తెలంగాణ వాణి)**
అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో పాల్వంచ అంబేద్కర్ సెంటర్‌లో తాతా మధు వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళన చేపట్టారు. ఆయన దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పూకంటి గోపాలరావు, కొండం వెంకన్న గౌడ్, మహిపతి రామలింగం, నూకల రంగారావు, గంగిరెడ్డి భువనసుందర్ రెడ్డి, పైడి పల్లి మహేష్, చింతా నాగరాజు, కార్పొరేటర్లు బాణోతు బాలునాయక్, దాంతేబోయిన నరేష్, మాలంపాటి భవిత, దున్నపోతుల మణి, దొప్పలపూడి సురేష్ బాబు, కనగాల నారాయణరావు, నల్లమల్ల సత్యం, గుండు రవి, గుర్రం వెంకటరత్నం, దారా చిరంజీవి, బాలినేని నాగేశ్వరరావు, షేక్ బాషా, షఫీ, సదాశివ, యర్రంశెట్టి మధు, అజ్మీరా జగదీశ్, తేజావత్ కిషోర్, ఓలపల్లి రాంబాబు, మాలంపాటి కిరణ్, చౌగాని పాపారావు, ధర్మసోత్ ఉపేందర్ నాయక్, కటుకూరి శేఖర్, సంతోష్ కుమార్, కొత్తపల్లి రవి, భూక్యా శంకర్, ఇస్లావత్ కుమార్, వై.అనిల్, గుగులోత్ రవి, పొలగాని పవన్ కుమార్, కొండూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు..

**ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మ దహనం**



**కొత్తగూడెం, సెప్టెంబర్ 8 (తెలంగాణ వాణి)**
తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ చుంచుపల్లి మండలంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జేమ్స్ సునీల్ ఆధ్వర్యంలో రుద్రంపూర్ గ్రామపంచాయతీ వద్ద మంగళవారం ఆందోళన చేపట్టి, తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవిలో ఉన్న స్పీకర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. స్పీకర్‌కు తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ కేస్లీతో పాటు గుమ్మడి శీను, అచ్చ నాగరాజు, జె. రాజేశ్వరరావు, మంద శ్రీరాములు, యాకూబ్, అజిత్ ఖాన్, నిమ్మల సాగర్, డాక్టర్ కరుణాకర్, డాన్ శీను, దామోదర్, నవీన్, ప్రణయ్, కొంకటి సత్తి, అమృతరావు, కే. రవీందర్ తదితర నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**కళాశాలల బంద్‌కు ఏఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దతు**




**చుంచుపల్లి, సెప్టెంబర్ 8 (తెలంగాణ వాణి)**
రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. మంగళవారం బాబు క్యాంప్‌లోని మొహమ్మద్ రజాబ్ అలీ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ఎస్కే షాహిద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాలల యాజమాన్యాలు పిలుపునిచ్చిన రాష్ట్ర వ్యాప్త కళాశాలల బంద్‌కు ఏఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. బకాయిలు విడుదల కాక కళాశాలల నిర్వహణ ఇబ్బందిగా మారడంతో పాటు పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్ మర్మం ఉమా మహేశ్వర్ జిల్లా ఉపాధ్యక్షులు కొరిమి సంజయ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్యామల హాసిని స్వరాంజలి సాత్విక తదితరులు పాల్గొన్నారు.

# ఆయుర్వేద వైద్యులంతా ఏకమవ్వాలి

**- భద్రాచలంలో ప్రారంభమైన పారంపర్య వైద్య మహాసభలు**





**కొత్తగూడెం, సెప్టెంబర్ 8 (తెలంగాణ వాణి):**
వంశపారంపర్యంగా వైద్యం చేస్తున్న వైద్యులంతా ఏకతాటిపైకి వచ్చి, భారతీయ ఆయుర్వేద వైద్య విధానాన్ని మరింత బలోపేతం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. పారంపర్య వైద్య మహా సంఘం (పీవీఎంఎస్) మూడో రాష్ట్ర మహాసభలు మంగళవారం భద్రాచలంలోని భక్త మార్కండేయ భవన్‌లో ప్రారంభమయ్యాయి. మహాసభల ప్రారంభానికి ముందు ఆయుర్వేదానికి మూలపురుషుడైన ధన్వంతరిని స్మరించుకుంటూ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భారతీయ సనాతన ఆయుర్వేద, సిద్ధ వైద్య విధానాలు వేల సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా కొనసాగుతున్నాయని తెలిపారు. దేశం, ప్రజల పట్ల అంకితభావంతో పనిచేసే వైద్యులను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మరుగునపడుతున్న ప్రాచీన వైద్య గ్రంథాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు పారంపర్య వైద్యులందరినీ ఏకతాటిపైకి తీసుకురావడమే మహాసభల ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రతి వ్యాధికి అందుబాటులో ఔషధ పరిష్కారం ఉండేలా పరిశోధనలు, వైద్య సేవలను విస్తరించాలని పిలుపునిచ్చారు. మహాసభలకు భారత ధర్మ దేవత బ్రహ్మచారి శ్రీశ్రీశ్రీ శివస్వామి, మానవీయ వైద్యుడు జమాల్‌ఖాన్, రామడుగు వీరభద్రాచారి, పర్యావరణవేత్త మొక్కల వెంకటయ్యతో పాటు ఆంధ్రప్రదేశ్, మదురై, ఛత్తీస్‌గఢ్, కేరళ, కర్ణాటక, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు, ప్రత్యేక ఆహ్వానితులు హాజరయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర అధ్యక్షుడు దొంత యాత్రి మహారుషి, ఉపాధ్యక్షులు రామంచి శ్రీనివాస్, సీహెచ్ భానుప్రసాద్, కోశాధికారి తోవేటి దుర్గారాణి, ఎస్కే వాహిద్ అలీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ జి. సుగుణారావు, కో-కన్వీనర్ నాగేశ్వరరావు, తూము రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**మొక్కలతో స్వాగతం..**
ప్రకృతి ప్రేమికురాలు, హరిత దీక్షకురాలు చిన్నారి నైనిక రజ్వా వేదికపై ఆసీనులైన వైద్యులకు మొక్కలను అందజేయడం ఆకట్టుకుంది. అలాగే మహాసభల సందర్భంగా సుమారు 500 రకాల ఔషధ మొక్కలను ప్రదర్శనగా ఏర్పాటు చేసిన పర్యావరణవేత్త మొక్కల వెంకటయ్యను పలువురు వైద్యులు అభినందించారు.

## జీవో 76తో సింగరేణి ప్రాంత పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

**అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ**
**హర్షం వ్యక్తం చేసిన ఐఎన్‌టీయూసీ నాయకుడు ఎండీ రజాక్**



**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 8 (తెలంగాణ వాణి)**
సింగరేణి బొగ్గు గనుల ప్రాంతాల్లో నివసిస్తున్న అర్హులైన నిరుపేద కుటుంబాలకు జీవో నంబర్ 76 ఆధారంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీలో హామీ ఇచ్చారు. మంగళవారం జరిగిన శాసనసభ సమావేశాల్లో మంత్రి ఈ మేరకు స్పష్టత ఇవ్వడంపై సింగరేణి ప్రాంత ప్రజలు, కార్మిక వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.
ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ మాట్లాడుతూ.. గతంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చొరవతో జీవో 76 ద్వారా సింగరేణి ప్రాంత ప్రజలకు ఇళ్లను మంజూరు చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సింగరేణి ప్రాంత పేదల గృహ అవసరాలను గుర్తించి, అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని ప్రకటించడం అభినందనీయమన్నారు. సింగరేణి ప్రాంత నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా అసెంబ్లీలో హామీ ఇచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి కొత్తగూడెం ఏరియా ఐఎన్‌టీయూసీ తరఫున ఎండీ రజాక్ కృతజ్ఞతలు తెలిపారు.

## కోతులు.. కుక్కల బెడద నుంచి కాపాడండి

**- మండల ప్రజల ఆవేదన.. 30 రోజుల్లో 60కిపైగా కాటు కేసులు**



**కొత్తగూడెం, సెప్టెంబర్ 8 (తెలంగాణ వాణి)**
మండలంలోని పలు పంచాయతీల పరిధిలో కోతులు, వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. విద్యానగర్, చుంచుపల్లి, బాబుక్యాంప్, ఎన్కే నగర్, రామాంజనేయ కాలనీ, రుద్రంపూర్, గౌతంపూర్, ధన్‌బాద్ తదితర ప్రాంతాల్లో కోతుల గుంపులు, వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతులు రోడ్లపై సంచరిస్తూ చిన్నారులు, మహిళలపై దాడులకు పాల్పడటంతో పాటు ఇళ్లలోకి చొరబడి వస్తువులను ఎత్తుకెళ్తున్నాయని తెలిపారు. వీధికుక్కలు గుంపులుగా తిరుగుతూ చిన్నారులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులపై దాడులు చేస్తున్నాయని పేర్కొన్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లలు, మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారని తెలిపారు. కోతులు, కుక్కల దాడుల తీవ్రతకు పెనగడప పీహెచ్‌సీలో నమోదవుతున్న కేసులే నిదర్శనమని స్థానికులు చెబుతున్నారు. గత 30 రోజుల్లో కుక్కకాటు, కోతికాటుకు సంబంధించి 60కిపైగా కేసులు నమోదైనట్లు వైద్యులు తెలిపినట్లు పేర్కొన్నారు. ఇటీవల రుద్రంపూర్‌లో కోతి దాడిలో ఓ మహిళ గాయపడగా, మరో చిన్నారిని కోతి కరవడంతో హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందించాల్సి వచ్చిందని తెలిపారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కోతులు, వీధికుక్కలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టి ప్రజలకు రక్షణ కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## స్పీకర్‌పై వ్యాఖ్యలకు నిరసన.. తాతా మధు దిష్టిబొమ్మ దహనానికి యత్నం

**- అశ్వారావుపేటలో కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన.. పోలీసులతో తోపులాట**





**అశ్వారావుపేట, సెప్టెంబర్ 8 (తెలంగాణ వాణి):**
తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం అశ్వారావుపేట పట్టణంలో నిరసన చేపట్టారు. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని తాతా మధుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసనలో భాగంగా ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట జరగడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు దిష్టిబొమ్మను స్వాధీనం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ శాసనసభ స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవుల్లో ఒకటని, దాని గౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తాతా మధు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని, ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్నంశెట్టి సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌బాబు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా ఎమ్మెల్యేల అవమానంపై భారీ ర్యాలీ




**కొత్తగూడెం, సెప్టెంబర్ 8 (తెలంగాణ వాణి)**
మహిళా శాసనసభ్యులను అవమానపరిచిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ మంగళవారం టీఆర్ఎస్ ఆధ్వర్యంలో కొత్తగూడెం నియోజకవర్గంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సూచనల మేరకు పార్టీ నాయకులు, మహిళా ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు కాంగ్రెస్ గ్యారంటీలను అమలు చేయాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. పార్టీ ప్రతినిధిగా ఏనుగుల రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## సింగరేణిలో వెంటనే కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలి

**టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి**



**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 8 (తెలంగాణ వాణి)**
సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘాల రెండేళ్ల కాలపరిమితి ముగిసినందున వెంటనే కొత్త ఎన్నికలు నిర్వహించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్), సింగరేణి సీఎండీకి వినతిపత్రాలు అందజేశారు. 2023 డిసెంబర్ 27న సీక్రెట్ బ్యాలెట్ ద్వారా కార్మిక సంఘాల ఎన్నికలు జరిగాయని, రెండేళ్ల కాలపరిమితి ఇప్పటికే పూర్తయిందని తెలిపారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు సింగరేణిలోని అన్ని కార్మిక సంఘాలకు సమాన హోదా, ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ప్రజాస్వామ్యయుత, పారదర్శక ప్రాతినిధ్య వ్యవస్థ కొనసాగేందుకు త్వరితగతిన ఎన్నికలు నిర్వహించాలని వినతిపత్రంలో కోరినట్లు యూనియన్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రెటరీ రామకృష్ణ తెలిపారు.

## ముత్యాలమ్మ గుడి వద్ద అసాంఘిక కార్యకలాపాలు అరికట్టాలి

**పోలీసు పెట్రోలింగ్ పెంచాలని టేకులపల్లి ప్రజల డిమాండ్**



**టేకులపల్లి, సెప్టెంబర్ 8 (తెలంగాణ వాణి)**
టేకులపల్లి పంచాయతీ 3వ వార్డు పరిధిలోని ముత్యాలమ్మ గుడి సెంటర్, పరిసర ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. రాత్రివేళల్లో వీధి దీపాలు లేకపోవడంతో చీకటిని ఆసరాగా చేసుకుని ఆకతాయిలు, వ్యసనపరులు గందరగోళం సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుడి ప్రాంగణంలో మద్యం సీసాలు పగులగొట్టడంతో పాటు బోరు మోటార్ స్టార్టర్, డీపీ సిస్టమ్ చోరీకి గురైనట్లు తెలిపారు. ఖాళీ గోదామును అడ్డాగా చేసుకుని రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయని ఆరోపించారు. అధికారులు స్పందించి గుడి పరిసరాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు పెట్రోలింగ్ పెంచి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# మహిళా ప్రజాప్రతినిధులపై నిర్బంధమా?

**- సబిత, సునీతల అరెస్టు, దురుసు వ్యవహారంపై బీఆర్ఎస్ మహాధర్నా**




**అశ్వారావుపేట, సెప్టెంబర్ 8 (తెలంగాణ వాణి):**
మహిళా ప్రజాప్రతినిధులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలను అరెస్టు చేయడం, వారి పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారనే ఆరోపణలను నిరసిస్తూ మంగళవారం అశ్వారావుపేటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు మహిళా ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ముందుగా కాసాని పద్మ, కౌన్సిలర్ ఉదయజ్యోతి నేతృత్వంలో మహిళా నాయకులు, కార్యకర్తలు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని వినతిపత్రం సమర్పించారు. రాజ్యాంగ హక్కులను, నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని వారు ఆరోపించారు. మహిళా ప్రజాప్రతినిధులకే రక్షణ, గౌరవం లేకపోతే సామాన్య మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అనంతరం ర్యాలీగా ప్రధాన రింగ్ రోడ్డు కూడలికి చేరుకున్న బీఆర్ఎస్ శ్రేణులు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించే వారిని అరెస్టులతో అణచివేయడం సరికాదని, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల అనుచితంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.
కార్యక్రమంలో మండల నాయకులు భూక్యా ప్రసాద్, జుజ్జురపు శ్రీరామ్మూర్తి, సత్యవరపు సంపూర్ణ, గుడవర్తి వెంకటేశ్వరరావు, సర్పంచులు సోడెం భారతి, మిద్దిన వెంకటనరసమ్మ, తోట వెంకటమ్మ తదితరులతో పాటు పలువురు నాయకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

RNI NO APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana



# తెలంగాణ వెలుగులకు సింగరేణి భరోసా



### స్వరాష్ట్ర విద్యుత్ అవసరాలకే 90 శాతం సరఫరా

### దేశం నలుమూలల నుంచి సింగరేణి

### బొగ్గు కోసం వినతులు

### తెలంగాణ అవసరాలకే ప్రాధాన్యం

### ఆగస్టులో విద్యుత్ రంగానికి 40.51 లక్షల టన్నుల బొగ్గు.. అందులో తెలంగాణకే 36.26 లక్షల టన్నులు

**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 8 (తెలంగాణ వాణి)**
దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం పెరుగుతూ.. థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు అవసరాలు అధికమవుతున్న వేళ సింగరేణి సంస్థ స్వరాష్ట్రమైన తెలంగాణకు అండగా నిలుస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో దేశంలోని పలు విద్యుత్ సంస్థలు సింగరేణి వైపు చూస్తూ.. 'మాకూ బొగ్గు సరఫరా చేయండి' అంటూ కోరుతున్నాయి. సింగరేణి బొగ్గుకు ఇంతటి డిమాండ్ ఉన్నప్పటికీ సంస్థ మాత్రం తెలంగాణ విద్యుత్ అవసరాలకే తొలి ప్రాధాన్యం ఇస్తోంది. రాష్ట్రంలో నిరంతరాయ విద్యుత్ సరఫరాకు భరోసా కల్పించాలన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలకు అనుగుణంగా తెలంగాణలోని విద్యుత్ కేంద్రాలకు సింగరేణి నిరంతరాయంగా బొగ్గు సరఫరా చేస్తోంది. కీలక సమయాల్లో విద్యుత్ రంగానికి అండగా నిలుస్తూ రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక ప్రగతికి చోదకశక్తిగా మారుతోంది. ఇతర రాష్ట్రాలకు బొగ్గు విక్రయం ద్వారా వాణిజ్య అవకాశాలు ఉన్నప్పటికీ.. 'సంస్థ వాణిజ్య ప్రయోజనాల కన్నా స్వరాష్ట్ర ప్రయోజనాలే ప్రాధాన్యం' అన్న విధానంతో ఉత్పత్తి చేసిన బొగ్గులో తెలంగాణ అవసరాలకే సింహభాగం కేటాయిస్తూ తద్వారా రాష్ట్ర విద్యుత్ రంగానికి వెన్నుదన్నుగా నిలుస్తోంది.

**= ప్రతీ పది టన్నుల్లో తొమ్మిది టన్నులు తెలంగాణకే!**

సింగరేణి సంస్థ తాను ఉత్పత్తి చేసిన బొగ్గును దీర్ఘకాలిక ఇంధన సరఫరా ఒప్పందాలు ఉన్న ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలకు సరఫరా చేస్తూ వస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పలు విద్యుత్ సంస్థలకు కొన్ని దశాబ్దాలుగా బొగ్గు రవాణా చేస్తూ ఆయా రాష్ట్రాల ఇంధన అవసరాలను తీరుస్తోంది.
అయితే దేశంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షాకాలంలోనూ విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా తెలంగాణ విద్యుత్ అవసరాలకు సింగరేణి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. విద్యుత్ రంగానికి సరఫరా చేస్తున్న ప్రతీ పది టన్నుల బొగ్గులో దాదాపు తొమ్మిది టన్నులు తెలంగాణలోని విద్యుత్ కేంద్రాలకే చేరుతుండటం విశేషం. గత నెలలో సింగరేణి 40,51,312 టన్నుల బొగ్గును దేశంలోని విద్యుత్ సంస్థలకు సరఫరా చేయగా.. అందులో 36,25,937 టన్నుల బొగ్గును తెలంగాణలో ఉన్న విద్యుత్ సంస్థలకు రవాణా చేయడం జరిగింది. అంటే తెలంగాణ రాష్ట్రంలో ఉన్న జెన్ కోలకు దాదాపు 90 శాతం సరఫరా జరిగింది. సగటున ఒక రోజుకు 1,30,687 టన్నుల బొగ్గును థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేస్తుండగా.. తెలంగాణ థర్మల్ కేంద్రాలకు సగటున రోజుకు 1,16,966 టన్నుల బొగ్గును అందిస్తూ రాష్ట్ర ఇంధన అవసరాలు తీరుస్తోంది.

**= అత్యధికంగా టీజీ జెన్ కోకు 50 శాతం బొగ్గు.**

గత నెలలో కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రానికి 6,99,661 టన్నుల బొగ్గును 179 రేకుల ద్వారా సరఫరా చేయడం జరిగింది. సగటున రోజుకు 22,570 టన్నుల చొప్పున సగటున రోజుకు ఆరు రేకుల ద్వారా రవాణా జరిగింది. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి 7,99,017 టన్నుల బొగ్గును 203 రేకుల ద్వారా సరఫరా చేయడం జరిగింది. ఈ లెక్కన సగటున రోజుకు 25,775 టన్నుల బొగ్గు సగటున రోజున 7 రేకుల ద్వారా రవాణా అయింది. భూపాలపల్లి లోని కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ కు 1,02,959 టన్నుల బొగ్గును రవాణా చేసింది. కాగా భద్రాద్రి థర్మల్ ప్లాంట్ కు 4,14,719 టన్నుల బొగ్గును సగటున రోజుకు 13,378 టన్నుల చొప్పున బొగ్గును రవాణా చేయడం జరిగింది.
మొత్తం మీద చూస్తే తెలంగాణ జెన్కోకు గత నెలలో 382 రైల్వే రేకుల ద్వారా 20,16,356 టన్నుల బొగ్గును సింగరేణి సంస్థ రవాణా చేసింది. ఈ మొత్తం రాష్ట్రంలోని విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేసిన బొగ్గులో 50 శాతం కావడం విశేషం. అలాగే రాష్ట్ర ఇంధన అవసరాలు తీర్చుతున్న రామగుండం ఎన్టీపీసీ ప్లాంట్లకు 7,28,164 టన్నుల బొగ్గును, అలాగే ఎన్టీపీసీ తెలంగాణ ప్లాంట్‌కు 4,15,839 టన్నుల బొగ్గును సరఫరా చేయడం జరిగింది. సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (జైపూర్)కు 4,65,579 టన్నుల బొగ్గును సరఫరా చేయడం జరిగింది.

**= సింగరేణి బొగ్గు కోసం ఇతర రాష్ట్రాల వినతులు**

దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలకు నిరంతర సరఫరా కీలకంగా మారింది. ఈ పరిస్థితుల్లో సింగరేణి బొగ్గుకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా డిమాండ్ పెరుగుతోంది. కొన్నేళ్లుగా సింగరేణికి వినియోగదారుగా ఉన్న పశ్చిమబెంగాల్ లోని దామోదర వ్యాలీ కార్పోరేషన్ డీవీసీ నుంచి 1 మిలియన్ టన్నులు, దుర్గాపూర్ లోని ఎన్ టీ ఈసీఎల్ నుంచి 1.2 మిలియన్ టన్ను, ఎన్ఎస్‌పీసీఎల్-ఝుజ్జర్ (ఆరావళి) నుంచి 1 మిలియన్ టన్నుల, తమిళనాడులోని ఎన్‌టీఈసీఎల్ నుంచి 2 మిలియన్ టన్నుల బొగ్గుకు, ఇతర విద్యుత్ సంస్థలు తమకు సింగరేణి బొగ్గును రవాణా చేయాలని కోరుతున్నాయి.
బొగ్గుకు ఇంత తీవ్రమైన డిమాండ్ ఉన్న నేపథ్యంలో సింగరేణి సంస్థ దీనిని వ్యాపారాత్మకంగా మలుచుకునే అవకాశాలు ఉన్నప్పటికీ రాష్ట్ర విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇతర రాష్ట్రాల డిమాండ్లను పక్కకు పెట్టి రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గును సరఫరా చేస్తుంది.

**=రాష్ట్ర అవసరాలకు ఒడిశాలోని నైనీ బొగ్గు కూడా..**

ఒడిశాలో సింగరేణి సంస్థ ఉత్పత్తిని ప్రారంభించిన నైనీ బొగ్గు గని నుంచి కూడా బొగ్గును స్వరాష్ట్రానికి తరలిస్తోంది. ఇప్పటికే సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి ఒక్కొక్కటి చొప్పున రైల్వే రేకుల ద్వారా బొగ్గును సరఫరా చేసింది. ఒడిశాలో రవాణా ఇబ్బందులు ఉన్నప్పటికీ రానున్న రోజుల్లోనూ మరింత బొగ్గు సరఫరా చేసేందుకు సంసిద్ధంగా ఉంది. నైనీలో ప్రస్తుతం 15 లక్షల టన్నుల బొగ్గు



వెలికితీయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ... కేవలం రాత్రి వేళలో మాత్రమే అక్కడ బొగ్గును రైల్వే సైడింగ్ వరకు రవాణా చేయడానికి అనుమతి ఉన్నందున ఎక్కువ పరిమాణంలో బొగ్గు సరఫరాను పెంచలేని పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ ఉత్పత్తి చేస్తున్న నైనీ బొగ్గును కూడా రాష్ట్ర ప్రయోజనాలకు వినియోగిస్తోండటం గమనార్హం.

**=ప్రత్యేక అధికారుల నియామకం ద్వారా నిరంతర రవాణాకు చర్యలు**

రాష్ట్ర విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క గత కొద్ది నెలలుగా సింగరేణి సహా ఇంధన సంస్థలతో అత్యున్నత సమన్వయ సమావేశాలను ఏర్పాటు చేసి తగినంత బొగ్గు సరఫరాపై మార్గనిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం అన్ని ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తి, రవాణాను క్రమంగా పెంచుతోంది. నాణ్యమైన బొగ్గును సకాలంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయటం కోసం సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అయిదుగురు ప్రత్యేక అధికారులను పర్యవేక్షణ కోసం నియమించారు. దీనితో తగినంత బొగ్గు ఉత్పత్తి జరగటమే కాక సకాలంలో సీహెచ్‌పీల ద్వారా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా అవుతోంది. ఇందుకు తగినన్ని రైల్వే రేకులను సమకూర్చుకోవడం, రవాణా చేయటం జరుగుతుంది. ఎల్‌నినో వల్ల రాష్ట్రంలోని విద్యుత్ డిమాండ్ గతంతో పోల్చితే పెరిగిన నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఇతర రాష్ట్రాలకు సరఫరాను తగ్గించడం జరిగింది.

## ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులపై సీఐటీయూ ధర్నా

### కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో సాధించింది ఇదేనా?



**అశ్వారావుపేట, సెప్టెంబర్ 8 (తెలంగాణ వాణి):**
ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో నిర్వహించేధర్నాకువెళ్తున్న వారిని అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఆశా వర్కర్లను అక్రమంగా అరెస్టు చేయడమే సాధించిందా? అని ప్రశ్నించారు. ఆశా వర్కర్ల అరెస్టులను నిరసిస్తూ మంగళవారం అశ్వారావుపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలుగా ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, ఆ హామీని అమలు చేయాలని కోరడం నేరమైందా అని ప్రశ్నించారు. ఆరు నెలల పీఆర్సీ ఏరియర్స్ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఎన్‌హెచ్‌ఎం సర్వేలు, పల్స్‌పోలియో, ఎన్నికల విధులు తదితర బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏఎంసీ, పీఎంసీ టార్గెట్లను రద్దు చేయాలని, ఆశా వర్కర్లకు రూ.50 లక్షల బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు, అశ్వారావుపేట మండల కన్వీనర్ కేసుపాక నరసింహారావు, మురహరి రఘు, కనితి భారతి, నాగమణి, సుభాని, రత్న, చిలకమ్మ, మంగ, తిరుపతమ్మ, రాధ, బుల్లెమ్మ, శాంతి తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు సేవ చేసేందుకే ఛారిటబుల్ ట్రస్ట్

### నిరుపేద వృద్ధురాలికి వీల్‌చైర్ పంపిణీ



**తల్లాడ, సెప్టెంబర్ 8 (తెలంగాణ వాణి):**
సమాజంలోని నిరుపేదలకు అండగా నిలిచి సేవలందించేందుకే ఇశ్రాయేలు చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ ఖమ్మంపాటి ఇజ్రాయిల్ తెలిపారు. మంగళవారం తల్లాడకు చెందిన నిరుపేద వృద్ధురాలు కొంగల ముత్తమ్మకు ట్రస్ట్ ఆధ్వర్యంలో వీల్‌చైర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ మాట్లాడుతూ.. తమ సేవా సంస్థ ద్వారా నిరుపేదలను గుర్తించి, దాతల సహకారంతో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అట్టడుగు వర్గాల ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నామని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములై పేదలకు అండగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్థానిక గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## తల్లాడలో కాంగ్రెస్ భారీ ర్యాలీ

### తాతా మధును సస్పెండ్ చేయాలని డిమాండ్.. దిష్టిబొమ్మ దగ్ధం





**తల్లాడ, సెప్టెంబర్ 8 (తెలంగాణ వాణి):**
తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపిస్తూ ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ తల్లాడ మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నుంచి ప్రారంభమైన ర్యాలీలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన సుమారు 700 మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాల మధ్య కాంగ్రెస్ జిందాబాద్, తాతా మధును సస్పెండ్ చేయాలి, రేవంత్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.
అనంతరం బస్టాండ్ ఎదుట తాతా మధు దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ తల్లాడ మండల ఇన్‌చార్జి మూడుముంతల గంగరాజు, మండల అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు తాళ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తక్షణమే ఆయనపై చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.
కాగా, కాంగ్రెస్ నిర్వహించిన ర్యాలీలో తెలుగుదేశం పార్టీ జెండాలు కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

### - ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య





**టేకులపల్లి, సెప్టెంబర్ 8 (తెలంగాణ వాణి):**
ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించి, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే తన ధ్యేయమని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం టేకులపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన వివిధ అభివృద్ధి పనులకు శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. కొత్తతండా (పి) గ్రామపంచాయతీలో సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు శంకు స్థాపన చేసిన ఎమ్మెల్యే.. రాంపురంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం తావుర్య తండాలో రూ.25 లక్షలతో నిర్మించనున్న మహిళా సమైక్య భవనం, సీసీ డ్రైన్ పనులకు భూమిపూజ చేశారు. గ్రామ ప్రజలను కలిసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**ఘనంగా జన్మదిన వేడుకలు**

ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని తూర్పుగూడెం, కొత్తతండా, టేకులపల్లి కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు చూపుతున్న ప్రేమాభిమానాలకు కనకయ్య కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశీస్సులతో నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

**తాతా మధు వ్యాఖ్యలపై ఆగ్రహం**

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని, దళిత నాయకుడిని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తాతా మధు వెంటనే స్పీకర్‌కు, దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసనగా టేకులపల్లిలో కాంగ్రెస్ శ్రేణులు తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, మండల అధ్యక్షుడు లక్కినేని శ్యామ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

### - రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ పిలుపు





**తల్లాడ, సెప్టెంబర్ 8 (తెలంగాణ వాణి):**
నల్గొండలో నవంబర్ 17 నుంచి 19 వరకు నిర్వహించనున్న రైతు సంఘం 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ పిలుపునిచ్చారు. మంగళవారం తల్లాడ మండలంలో రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు, కార్పొరేట్ అనుకూల నిర్ణయాలను తీవ్రంగా ఖండించారు. ఎరువుల ఆన్‌లైన్ విధానం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దానిని వెంటనే రద్దు చేసి సక్రమమైన విధానంలో ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్నా సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రస్తుతం పంటలకు అత్యవసరంగా నీరు అందిస్తేనే దిగుబడులు చేతికందే పరిస్థితి ఉందని, ప్రభుత్వం వెంటనే సాగునీరు విడుదల చేయాలని కోరారు.
జాతీయ మహాసభల సందర్భంగా 36 మంది రైతులు పంచెలు ధరించి ప్రత్యేకంగా ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, శీలం సత్యనారాయణరెడ్డి, శీలం పకీరమ్మ, అయినాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, కళ్యాణ కృష్ణయ్య, పులి కృష్ణయ్య, మన్నేపల్లి రామారావు, సత్తెనపల్లి నరేష్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దేవాదాయ పరిధిలోకి భక్తాంజనేయ స్వామి దేవస్థానం

### దేవాదాయ ధర్మాదాయ శాఖ ఖమ్మం డివిజన్ పరిశీలకురాలు ఆర్. సమత




**తల్లాడ, సెప్టెంబర్ 8 (తెలంగాణ వాణి):**
తల్లాడ మండలం అంజనాపురం (రేచర్ల) గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ భక్తాంజనేయ స్వామి, అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం ఇకపై ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోకి వచ్చినట్లు ఖమ్మం డివిజన్ పరిశీలకురాలు ఆర్. సమత తెలిపారు. బుధవారం దేవాలయ పాలకవర్గం సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో ఆమె ఈ విషయాన్ని ప్రకటించారు. దేవాలయాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని గ్రామస్తులు ప్రజావాణి ద్వారా వినతులు సమర్పించారని, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దేవస్థానాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకున్నట్లు తెలిపారు. ఇకపై దేవాలయంతో పాటు దానికి సంబంధించిన పరిసర భూములు కూడా ప్రభుత్వ దేవాదాయ శాఖ పరిధిలో ఉంటాయని ఆమె పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని గ్రామస్తులు స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొమ్మినేని ప్రభాకర్, కేతినేని చలపతి, నల్లగొర్ల కృష్ణయ్య, గురజాల వెంకటయ్య, పాముల కృష్ణారావు, చందా వెంకటేశ్వర్లు, అనుమోలు కోటేశ్వరరావు, కిన్నెర వెంకటేశ్వర్లు, గురజాల సుబ్బారావు, కొండా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## అక్షరాస్యతపై అవగాహన ర్యాలీ

### శ్రీలక్ష్మి మండల సమాఖ్య ఆధ్వర్యంలో కార్యక్రమం

**తల్లాడ, సెప్టెంబర్ 8 (తెలంగాణ వాణి):**
ప్రపంచ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీలక్ష్మి మండల సమాఖ్య ఆధ్వర్యంలో తల్లాడలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఐకేపీ సిబ్బంది పాల్గొని అక్షరాస్యత ప్రాధాన్యంపై నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. 'ఇల్లాలు చదువుకుంటే ఇంటికి వెలుగు.. చదువుతోనే బంగారు భవిష్యత్తు' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగింది. ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించి అక్షరాస్యులుగా మారాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీధర్ రాజు, ఐకేపీ ఏపీఎం రవికుమార్, ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉంగరాల వెంకటేశ్వరరావు, ఐకేపీ సిబ్బంది, శ్రీలక్ష్మి మండల సమాఖ్య సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
బుధవారం , సెప్టెంబర్ 9 , 2026

# కోర్టు ఉత్తర్వులు ఉన్నా ఆగని వేధింపులు..!

**భూమి మాదేనని కోర్టు ఆదేశాలు, పోలీస్ ప్రొటెక్షన్ ఉన్నా దాడులు ఆగడంలేదంటున్న బాధితురాలు**

**దాడులు చేసి మాపైనే తిరిగి కేసులు పెడుతున్నారు**

**మేం ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదంటూ బానోత్ మంగమ్మ ఆవేదన**



**కొత్తగూడెం, సెప్టెంబర్ 8 (తెలంగాణ వాణి)**
చుంచుపల్లి మండలం 27/2అ, 128/2అ, 128/3అ సర్వే నంబర్ ల లోని తనకు సంబం దించిన 1ఎకరం 10 గుంటల భూమికి కోర్టు ఉత్తర్వులు తమకు అనుకూలంగా ఉన్నప్పటికీ తమపై వేధింపులు కొనసాగుతున్నాయని బాధితురాలు బానోత్ మంగమ్మ ఆరోపిస్తున్నారు. భూమిపై తమ హక్కును స్పష్టం చేస్తూ కోర్టు ఉత్తర్వులు ఉన్నాయని, వాటి ఆధారంగా పోలీస్ ప్రొటెక్షన్ కూడా తీసుకున్నామని, అయినప్పటికీ ప్రత్యర్థులు తమపై దాడులకు పాల్పడుతూ, తిరిగి తమపైనే కేసులు నమోదు చేయిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ భూమిని కబ్జా చేసేందుకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారని మంగమ్మ ఆరోపించారు. దాడులకు సంబంధించి తాము పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన అంతంతమాత్రంగానే ఉందని, తమపై దాడులు చేసి తిరిగి తమపైనే కేసులు పెడుతు చేయడం వల్ల మరింత ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొంటున్నారు.

**కోర్టు ఆదేశాలకు విలువ లేదా?**

తమ భూమిపై హక్కుకు సంబంధించి న్యాయస్థానం నుంచి స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నాయని బాధితులు చెబుతున్నారు. కోర్టు ఆదేశాల మేరకు పోలీస్ రక్షణ కూడా పొందామని పేర్కొంటున్నారు. అయినప్పటికీ తమపై ఒత్తిడి, బెదిరింపులు, దాడులు కొనసాగుతున్నాయని ఆరోపిస్తున్నారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ భూమి విషయంలో పదేపదే వివాదాలు సృష్టిస్తుండటంపై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. న్యాయస్థాన ఉత్తర్వులను గౌరవిస్తూ తమకు ప్రశాంతంగా జీవించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**మా ఫిర్యాదులపై ఎందుకు స్పందించరు?**

తమపై దాడులు జరిగినప్పుడు పోలీసులను ఆశ్రయించినా ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. తమ వద్ద కోర్టు ఉత్తర్వులు, పోలీస్ ప్రొటెక్షన్‌కు సంబంధించిన ఆధారాలు ఉన్నప్పటికీ న్యాయం కోసం మళ్లీ మళ్లీ అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలి**

ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపించాలని బాధితులు కోరుతున్నారు. కోర్టు ఉత్తర్వులు, తమ ఫిర్యాదులు, తమపై పెట్టిన కేసులు, దాడులకు సంబంధించిన ఆధారాలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

"కోర్టు ఉత్తర్వులు మా పక్షాన ఉన్నాయి. పోలీస్ ప్రొటెక్షన్ కూడా తీసుకున్నాం. అయినా మమ్మల్ని వేధిస్తున్నారు. మాపై దాడులు చేసి తిరిగి మాపైనే కేసులు పెడుతున్నారు. మేం ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని మాకు న్యాయం చేయాలన్న బానోత్ మంగమ్మ తమ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్న వ్యక్తి గతంలో కూడ ఓ స్థలం కబ్జా చేసే క్రమంలో స్థలం హక్కు దారులైన మహిళను కారుతో గుద్ది యాక్సిడెంట్ చేసి అదే కేసులో జైలుకు వెళ్లి వచ్చినట్టు తెలిపారు. ఇవన్నీ చెప్పి తనకు ప్రాణహాని ఉందని చెప్పి గత 8నెలల నుండి పలుమార్లు చుంచుపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినప్పటికి ఇప్పటి ఎటువంటి చర్యలు తీసుకోలేదని కనీసం ఆ వ్యక్తిని పిలిచి మందలించిన పాపాన కూడ పోలేదని ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేసారు.

# ప్రతి చుక్క.. ఒక ఆశ, ఒక జీవితం

**గీతంలో రక్తదాన శిబిరం నిర్వహణ**

**ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది**









**పటాన్ చెరు, సెప్టెంబర్ 8, (తెలంగాణ వాణి);**
'ప్రతి రక్తపు బొట్టూ విలువైనదే, ప్రతి దాత మార్పు తీసుకురాగలరు. ఒక చుక్క, ఒక ఆశ, ఒక జీవితం' అనే స్ఫూర్తిదాయక నినాదంతో ఎన్టీఆర్ ట్రస్టు బ్లడ్ బ్యాంక్ సహకారంతో, హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. స్వచ్ఛంద రక్తదానం పై అవగాహన కల్పించడం, ఈ కీలకమైన మానవతా కార్యక్రమానికి గీతం సమాజాన్ని సహకరించేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ఈరోజు మీరు ఇచ్చే రక్తదానం కోసం ఎక్కడో ఒకచోట ఎవరో ఒకరు ఎదురు చూస్తూ ఉండవచ్చు' అనే హృదయపూర్వక విజ్ఞప్తితో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా, గీతం విద్యార్థులు ముందుకొచ్చి, రక్తదానం అనే ఒక చిన్న చర్యను ప్రాణాలను కాపాడటంలో, ఆరోగ్యకరమైన, ఉజ్వల భవిష్యత్తును నిర్మించడంలో ఒక అర్థవంతమైన సహకారం గా మార్చమని ప్రోత్సహించారు.
గీతం హైదరాబాదులోని వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు సుమారు 170 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. అధ్యాపకులు, సిబ్బంది కూడా ఈ శిబిరంలో చురుకుగా పాల్గొన్నారు. తద్వారా సమాజ సంక్షేమానికి మద్దతు ఇవ్వడంలో, విద్యార్థులలో సామాజిక బాధ్యత సంస్కృతిని ప్రోత్సహించడంలో తమ నిబద్ధతను ప్రదర్శించారు. రక్తదాన ప్రక్రియను సురక్షితమైన, వ్యవస్థీకృత వాతావరణంలో నిర్వహించారు. దీనివల్ల దాతలు సౌకర్యవంతంగా, బాధ్యతాయుతంగా రక్తదానం చేసేందుకు వీలు కలిగింది. దాతలకు పండ్లు, శీతల పానీయాలను అందించారు. వారి విలువైన సేవకు గుర్తింపుగా ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. గీతం నాయకత్వం రక్తదాతల ను అభినందించి, రోగులకు, ఆరోగ్య సంరక్షణ సేవలకు సహాయపడటం లో స్వచ్ఛంద రక్తదానం ప్రాముఖ్యతను చాటి చెప్పింది. ఈ శిబిరంలో అధిక సంఖ్యలో పాల్గొనడం గీతం సమాజంలో కరుణ, సేవా స్ఫూర్తిని పునరుద్ఘాటించింది.
గీతం హైదరాబాద్ ఎన్.సి.సి. యూనిట్ ను సందర్శించిన కల్నల్ పి.ఎస్.సింగ్ నిజామాబాద్ గ్రూపు ఎన్.సి.సి. కమాండర్ కల్నల్ పి.ఎస్.సింగ్ మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని ఎన్.సి.సి. యూనిట్ ను సందర్శించారు. ఈ పర్యటన సందర్భంగా ఆయన గీతం ఎన్.సి.సి. క్యాడెట్లతో ముచ్చటించి, వివిధ ఎన్.సి.సి. శిబిరాలలో చురుకుగా పాల్గొనవలసిందిగా వారిని ప్రోత్సహించారు. క్యాడెట్లను ఉద్దేశించి కల్నల్ సింగ్ మాట్లాడుతూ, ఎన్.సి.సి. శిబిరాలలో పాల్గొనడం వ్యక్తిగత అభివృద్ధికి విలువైన అవకాశాలను అందిస్తుందని, అలాగే క్యాడెట్లు తమ ప్రతిభ, నైపుణ్యాలు, నాయకత్వ సామర్థ్యాలను ప్రదర్శించడానికి వీలు కల్పిస్తుందని చెప్పారు. ఈ పర్యటనలో సంగారెడ్డిలోని 33(టి) బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రమేష్ సరియల్ కూడా పాల్గొన్నారు. విద్యార్థి ఎన్.సి.సి. అండర్ ఆఫీసర్ల సహకారంతో, గీతం అసోసియేట్ ఎన్.సి.సి. ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎస్. అజయ్ కుమార్ ఈ పర్యటనను సమన్వయం చేశారు.

# ఇది శాసనసభనా.. కౌరవ సభనా?

**- హరీశ్‌రావు తీవ్ర వ్యాఖ్యలు.. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత**

**- "ప్రజా సమస్యలపై మాట్లాడితే పోలీసులను ఉసిగొల్పుతారా?"**





**మేడ్చల్-మల్కాజిగిరి(తెలంగాణ వాణి) సెప్టెంబర్ 08:**
సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావును పోలీసులు అడ్డుకుని జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో పోలీస్‌స్టేషన్ వద్దకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం హరీశ్‌రావు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

**"ఇది శాసనసభనా.. కౌరవ సభనా?"**

అసెంబ్లీలో చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇది శాసనసభనా.. లేక కౌరవ సభనా? మహిళా ఎమ్మెల్యేల చీరలు లాగుతారా? ఎన్నికైన ప్రజాప్రతినిధులపై పోలీసులను ప్రయోగిస్తారా? ఎమ్మెల్యేలను మెడపట్టి బయటకు గెంటేస్తారా?" అని ప్రశ్నించారు. "ఇది ఎలాంటి ప్రభుత్వం? సీఎం.. మీరు పోలీస్ రాజ్యం నడుపుతున్నారా? తెలంగాణ చరిత్రలోనే ఇది బ్లాక్‌డే. ఇది ప్రజాస్వామ్యమా?" అంటూ ప్రభుత్వ తీరును ప్రశ్నించారు.

**"ప్రజా సమస్యలపై మాట్లాడేందుకే వచ్చాం"**

అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకే తాము వచ్చామని హరీశ్‌రావు తెలిపారు. "వెయ్యి రోజుల కాంగ్రెస్ వైఫల్యాలను, ఆరు గ్యారెంటీలను, 420 హామీలను, పెన్షన్ల సమస్యను, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అసెంబ్లీలో మాట్లాడాలని వచ్చాం" అని పేర్కొన్నారు.తమ ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి వస్తుందనే భయంతోనే పోలీసులను ప్రయోగించిందని ఆరోపించారు. "వెయ్యి రోజుల్లో మీ వైఫల్యాలు బయటపడతాయని భయపడి మా మీదకు పోలీసులను ఉసిగొల్పారు" అని వ్యాఖ్యానించారు.

**మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల తీరుపై ఆగ్రహం**

అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు వ్యవహరించిన తీరుపై హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "మా మహిళా ఎమ్మెల్యే సునీత చీర లాగారు. సబితమ్మ గొంతు నొక్కారు. జగదీశ్‌రెడ్డినికిందపడేసి తొక్కారు. మా మహిళా సభ్యుల చీరలులాగినపోలీసులనుమేమువదిలిపెట్టం" అని అన్నారు.
ఈ ఘటనపై బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

**"బీజేపీ--కాంగ్రెస్ మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకున్నాయా?"**

ప్రతిపక్షానికి అసెంబ్లీలో మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. "బీజేపీ, కాంగ్రెస్ మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకున్నాయా? జీఓ 22-ఏ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాలపై నామమాత్రంగా చర్చ పెట్టి ప్రధాన ప్రతిపక్షాన్ని బయటకు నెట్టేస్తారా?" అని ప్రశ్నించారు.

**"నల్ల టీషర్టులు వేసుకుంటే తప్పేంటి?"**

నల్ల దుస్తులతో నిరసన తెలిపే అంశంపైనా హరీశ్‌రావు స్పందించారు. "రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ నల్ల టీషర్టులు వేసుకుని పార్లమెంటుకు వెళ్లొచ్చు. మేము ప్రజల తరపున అదే నల్ల టీషర్టులు వేసుకుని అసెంబ్లీకి వస్తే ఆపుతారా?" అని నిలదీశారు.ప్రజా సమస్యలపై శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్నామని స్పష్టం చేశారు. "రేవంత్‌రెడ్డిలాగా కొట్టడానికి కుస్తీ వాళ్లు ఉన్నారని మేము అనలేదు. మేము ప్రజల తరపున ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్నాం" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

పోలీస్‌స్టేషన్ వద్ద బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన
హరీశ్‌రావును జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించిన విషయం తెలియడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తూ ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీంతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులో ఉంచే ప్రయత్నం చేశారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చకు అవకాశం కల్పించాలని ఒకవైపు ప్రతిపక్షం డిమాండ్ చేస్తుండగా.. మరోవైపు అసెంబ్లీలో చోటుచేసుకున్న పరిణామాలు, పోలీసుల వ్యవహారశైలిపై రాజకీయ దుమారం కొనసాగుతోంది.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో తెలంగాణ ఆగమాగం

**- కేసీఆర్ చావును కోరడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం: ఏనుగుల రాకేష్‌రెడ్డి**



**కొత్తగూడెం, సెప్టెంబర్ 8 (తెలంగాణ వాణి):**
కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో తెలంగాణను అభివృద్ధి నుంచి వెనక్కి నెట్టిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు, ప్రభుత్వ వైఫల్యాలు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలు, ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద పరిణామాలు, బీఆర్ఎస్ ప్రజా ఉద్యమాలపై ఆయన మాట్లాడారు.2023 ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు, వివిధ హామీలు, డిక్లరేషన్ల పేరుతో ప్రజలను ఆకట్టుకుని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, రెండున్నరేళ్లు దాటినా ఇచ్చిన హామీల్లో అనేకం అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నిర్వహించిన నిరసనలకు ప్రజల నుంచి స్పందన లభించిందని పేర్కొన్నారు.
రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సహజమేనని, అయితే ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం, ఆయన చావును కోరడం రాజకీయ సంస్కృతికి విరుద్ధమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ కీలక పాత్ర పోషించారని, ఉద్యమ సమయంలో సకల జనుల సమ్మె సహా అనేక కార్యక్రమాలతో ప్రజలను ఏకం చేశారని గుర్తుచేశారు.
కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, 24 గంటల విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి పథకాలు అమలు చేశామని, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇచ్చామని రాకేష్‌రెడ్డి పేర్కొన్నారు. అలాంటి నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.
ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ తాతా మధుపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని, రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలు, హింసాత్మక ఘటనలకు తావులేకుండా కాంగ్రెస్ నాయకత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజాస్వామ్య విలువలు, రాజకీయ నైతికతలను అన్ని పార్టీలు కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ అని, ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ పోరాటం కొనసాగుతుందని రాకేష్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

